క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందిస్తున్న సాయికుమార్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట గ్రామానికి చెందిన యువకులకు గ్రామ యువకుడు నీలం సాయికుమార్‌గౌడ్ క్రీడా సామగ్రిని తన సొంత ఖర్చులతో అందజేశారు. శనివారం గ్రామంలో యువకులకు టీషర్ట్‌లతో పాటు, వాలీబాల్, క్రికెట్ కిట్‌లను అందజేశారు. యువత క్రీడలకు తగిన సమయం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, యాదగిరి, శ్యామ్, రాజు, శివ, మల్లేశ్, రాము, శ్రీనివాస్, పరశురాములు తదితరులు ఉన్నారు.

అటవీ భూముల ఆక్రమణ 14 మంది బైండోవర్

పాపన్నపేట(మెదక్): అటవీ భూములను ఆక్రమించిన 14 మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. శనివారం మెదక్ ఆర్డీఓ రాజేశ్వర్ సమక్షంలో వారిని బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని నామాపూర్, అన్నారం, చిత్రియాల్ పరిధిలో అటవీ భూములను ఆక్రమించుకున్న 14 మందిని గుర్తించి కేసు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు. వీరిలో నామాపూర్‌కు చెందిన ముగ్గురు, చంద్రు తండాకు చెందిన ఇద్దరు, చిత్రియాల్ తండాలో ఎనిమిది మంది, అన్నారంలో ఒకరిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ



అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిషత్ కార్యాలయాన్ని మెదక్ జెడ్పీ సీఈఓ ఎల్లయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే జిల్లాకు బదిలీపై వచ్చిన సీఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తు వివరాలు, ఆన్‌లైన్ నమోదుపై ఎంపీడీఓ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పెండింగ్ పనులు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన రాంపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్, మాజీ సర్పంచ్ భాస్కర్, ఎంపీపీ శ్రీనివాస్, శ్రీకాంత్, సాయికుమార్‌గౌడ్, శ్రీనివాస్, మోహన్‌నాయక్, భిక్షపతి, రాంరెడ్డి, గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలొద్దు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడా ప్రాంగణంలో ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టొద్దని మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోదండ కృష్ణాగౌడ్ అన్నారు. ఇప్పటికే ఒక ప్లానింగ్ లేకుండా ఆట స్థలంలో నిర్మించిన నిర్మాణాల వల్ల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి అవసరమైతే శిథిలావస్థలో ఉన్న పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తొలగించి అక్కడ నిర్మాణం చేయాలన్నారు. ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అంగీకరించే ప్రసక్తే లేదన్నారు.

భూములు లీజుకు తీసుకోవాలి

- దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు
- ప్రభుత్వం ధర చెల్లిస్తాం, పట్టాలు ఇవ్వాలని రైతుల డిమాండ్



దొంతిలో గ్రామసభ నిర్వహిస్తున్న దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న దేవాదాయశాఖ భూములకు సంబంధించి ప్రభుత్వ ధర చెల్లిస్తామని, పట్టాలు ఇవ్వాలని రైతులు అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి భూములు సాగు చేసుకుంటున్న రైతులతో శనివారం దేవాదాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది గ్రామసభ నిర్వహించారు. గ్రామ పరిధిలో ఉన్న వేణు గోపాలస్వామి దేవాలయ భూములు సర్వే నంబరు 78, 79, 100, 109, 136, 499లో గ్రామానికి చెందిన రైతులు 242 ఎకరాల భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ భూములకు సంబంధించి సాగు చేసుకుంటున్న రైతులు లీజుకు తీసుకొని ప్రభుత్వం నుంచి రుణాలు పొంది సాగు చేసుకోవాలని అధికారులు సూచించారు. అందుకు రైతులు ఒప్పుకోలేదు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వ ధర ప్రకారం డబ్బులు చెల్లిస్తామని పట్టా చేసి ఇవ్వాలన్నారు. కౌలు అగ్రిమెంట్ అంటే ఒప్పుకోమన్నారు. ఇప్పటి వరకు రైతులతో అధికారులు 12 గ్రామసభలు నిర్వహించినప్పటికీ భూములు లీజుకు తీసుకునేందుకు రైతులు ఒప్పుకునే ప్రసక్తి లేదని చెప్పారని తాజా, మాజీ సర్పంచ్ ఫణిశశాంక్‌శర్మ తెలిపారు. గ్రామసభకు వచ్చిన దేవాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, వివిధ అధికారులు హాజరు కాగా రైతుల అభిప్రాయాలను ఉన్నత అధికారులకు తెలియజేస్తామని వెళ్లిపోయారు.

మీడియాకు సమాచారం ఇవ్వని అధికారులు

దొంతి గ్రామంలో దేవాదాయ భూములకు సంబంధించి శనివారం నిర్వహించిన గ్రామసభ గురించి దేవాదాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటించారు. గ్రామసభకు రెండు శాఖల నుంచి ఉన్నత అధికారులు హాజరైనప్పటికీ అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.



నర్సాపూర్ చెరువు కట్టపై ఆట వస్తువులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

హరితహారం చెట్లు కాపాడాలి

నర్సాపూర్: హరితహారం కింద నాటిన చెట్లను కాపాడాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మున్సిపాలిటీ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన పలువురు సిబ్బందితో కలిసి రాయరావు చెరువు కట్టపై చెట్లు, ఓపెన్ జిమ్ పరికరాలు, ఆట వస్తువులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. చెరువు కట్టపై నాటిన మొక్కలను కాపాడాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు దావూద్, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆరోగ్యానికి పోషకాహారం అవసరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి



అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

కౌడిపల్లి(నర్సాపూర్): గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కుషన్‌గడ్డతండా పంచాయతీ భవానీమందిర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు, తల్లులు, గర్భిణుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, కోడిగుడ్డు, ఒక్కపూట పూర్తిస్థాయి భోజనం అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన చేస్తామన్నారు. గర్భిణులు ప్రతీ నెల వైద్యపరీక్షలు చేయించు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాదవి, ఏఎన్‌ఎం ప్రవీణ, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయశ్రీ, ఆశవర్కర్ లబ్ధిదారులు, తండావాలసులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. శనివారం తునికి ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో లెక్చరర్లు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నిబంధనల మేరకు డిగ్రీ కళాశాలకు సంబంధించి రికార్డులు పక్కగా నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రతీ వారం సెమినార్‌తో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు రివిజన్‌తో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భోజనం టెండర్‌దారుడికి నోటీసులు..

తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో భోజనం వండే టెండర్ దారుడికి రెండుసార్లు నోటీసులు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇటీవల ఉడకని అన్నం, నీళ్లచారుతో అధ్వాన్న భోజనం పెడుతున్నారని ఫిర్యాదు వచ్చింది. దీంతో ఆయనకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం వంట బాగుంటుందన్నారు. మరోసారి భోజనం సరిగా వండకపోతే నోటీసు ఇచ్చి తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏటీపీ గణేశ్, పీడీ రాజన్న, విక్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో కేసీఆర్ పదిలం

జిల్లా వ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను శనివారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు రక్తదాన శిబిరాలు నిర్వహించి, కేక్ కట్‌చేసి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో కేసీఆర్ పదిలమని కొనియాడారు.



నర్సాపూర్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మనోహరాబాద్(తూప్రాన్): రక్తదాన శిబిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో కేక్ కట్ చేస్తున్న పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



అల్లాదుర్గం(మెదక్): చిల్వెర జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

రామాయంపేట(మెదక్): మంజీరా విద్యాలయంలో శనివారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. శతమాన్యు జిల్లా విద్యాధికారిగా, మేఘన హెచ్‌ఎంగా, కృష్ణవేణి మండల విద్యాధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధనతీరు ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు వాసవి, జయప్రకాశ్, భవాని, సుధాకర్, శ్రీనివాస్, మౌనిక పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. డీఈఓగా యశ్వంత్, ఎంఈఓగా రాఘేశ్, కాంప్లెక్స్ ఎంఈఓగా మానస, హెచ్‌ఎంగా లాస్య, ఉపాధ్యాయులుగా కవిత, దీక్షిత్, మాధురి పాఠాలు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశామని పాఠశాల హెచ్‌ఎం రాధాబాయి తెలిపారు.

ఎల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంగా అవంతిక, డీఈఓగా మహేశ్, ఎంఈఓగా కార్తీక్, టీచర్లుగా జగదీష్, భానుప్రసాద్, ప్రభాస్, నంద వర్ధన్, దివ్యశ్రీ, సుచిత్ర వ్యవహరించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం రాజయ్య, టీచర్లు విక్రంగౌడ్, అంబికాసోని, వసంత, అలవేణి, సంగీత, శివభవాని పర్యవేక్షించారు.



శివ్వంపేట(నర్సాపూర్): గోమారం పీఎస్ పాఠశాలలో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించారు.

చిల్వెర జిల్లా పరిషత్ పాఠశాలలో..

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వెర జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్, పీఆర్‌టీయూ నాయకుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మంజీరా విద్యాలయంలో..



పెద్దశంకరంపేటలో..



పాపన్నపేట(మెదక్): ఎల్లాపూర్‌లో..

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు

చిన్నశంకరంపేట(మెదక్): వ్యక్తి అదృశ్యమైన ఘటన చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారం గ్రామానికి చెందిన గడ్డం బాల నర్సింహులు(53) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాలేదు. బంధువుల వద్ద వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా తెలిస్తే ఫోన్ నంబర్ 9010236712కు సమాచారం అందించాలని కుమారుడు అకిల్ కోరారు.

నేడు మంత్రి రాక

టేక్మాల్(మెదక్): అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం మండలానికి రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట కస్తూర్బా బాలికల పాఠశాలలో చట్టాలపై విద్యార్థినులకు పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, పోలీస్ శాఖ షీటీంలు అమ్మాయిలు, మహిళల రక్షణ కోసం తీసుకునే చర్యలు, బాల్య వివాహాలతో అనర్థాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాలరాజు, కళాబృందం సభ్యులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళా బృందం సభ్యులు

కొనసాగుతున్న తిరుమల బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో భక్తులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో తిరుమలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం రెండో రోజు నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో తిరుమల స్వామి ఆలయంలో శనివారం నిత్య హోమం, బలి హరణం, గరుడసేవ, హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, దేవాలయ ఈఓ మోహన్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్యామ్ రాజు, ఎల్లాగౌడ్, వడ్ల లక్ష్మి, కాకి రాజయ్య, వెంకటరాంమోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చేయూత

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కప్పల లక్ష్మి మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి ఎంఎస్ఎస్‌వో చైర్మన్ మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అర్చన, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఆంజన్న సన్నిధిలో భక్తజన సందడి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్లలో సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

◆ అయోధ్యకు రామభక్తులు

నర్సాపూర్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 196 మంది రామభక్తులు అయోధ్యకు వెళ్తున్నారు. శనివారం నర్సాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పార్టీ జిల్లా కార్యదర్శి రాజేందర్ తదితరులు ఆర్టీసీ డిపో వరకు వారితో కలిసి ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో పార్టీ నాయకులు రఘువీరారెడ్డి, నగేష్, ఆంజనేయులుగౌడ్, సతీష్ యాదవ్, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

◆ అయోధ్యకు బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): అయోధ్యకు బాలరాముడి దర్శనం కోసం బీజేపీ మండల నాయకులు, భక్తులు తరలివెళ్లారు. శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మాజీ సర్పంచ్ గంగాగౌడ్, విఠల్, బాలింగం, రాములు తదితరులు అయోధ్యకు వెళ్లారు.

◆ విద్యార్థులకు సన్మానం

తూప్రాన్: మండల స్థాయి టాలెంట్ టెస్టులో అల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపడంతో గ్రామ తాజా ఉప సర్పంచ్ కుమ్మరి బాలకృష్ణ శనివారం ఘనంగా సన్మానించారు. అల్లాపూర్ గ్రామానికి చెందిన మేఘన సాంఘీక శాస్త్రంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించింది. భార్గవి సాంఘీక శాస్త్రంలో మూడో స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ మల్లన్న జాతర ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మల్లన్న జాతర శనివారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది, సోమ వారాల్లో జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

◆ మత్స్య సహకార నూతన కమిటీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట గ్రామ నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘ కమిటీని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాముని నగేశ్, ఉపాధ్యక్షుడిగా కోడలి నాగేష్, కార్యదర్శిగా ఎర్రబోయిన బలరాం, డైరెక్టర్లుగా నర్సింగరావు, నాగరాజు, భిక్షపతి, గంగారం, కృష్ణ, కొండయ్య, శ్రీకాంత్ నియమితులయ్యారు. మత్స్యకారులు పాల్గొన్నారు.

◆ యాదగిరి గుట్ట బస్సును పునరుద్ధరించండి

చిన్నశంకరంపేట(మెదక్): యాదగిరి గుట్ట ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. శనివారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ... మెదక్ నుంచి చిన్నశంకరంపేట మీదుగా యాదగిరిగుట్టకు నడిచే బస్సును పునరుద్ధరించి భక్తులకు సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో పట్టణ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ యూత్ నాయకులు ఆకుల రాజు, మేడి శ్రీను, మధు, నర్సింలు, అశోక్, సురేశ్, కుమ్మరి మహేశ్ పాల్గొన్నారు.

◆ ట్రాక్టర్లు, టిప్పర్ల పట్టివేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని ఓ వ్యవసాయ పొలం నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, 2 టిప్పర్లు, ఒక జేసీబీని శనివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని కొల్చారం పోలీసులకు అప్పగించారు. ఏఎస్‌ఐ తారాసింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన వినోద్ కుమార్ తన తండ్రి రిటైర్డ్ టీచర్ పెంటయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు శనివారం పరీక్షాప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం సుజాత, నాయకులు ఆగమయ్య ఉన్నారు.

◆ స్నేహితుడి జ్ఞాపకార్థం..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారంలో ఏడాది క్రితం మృతి చెందిన స్నేహితుడి జ్ఞాపకార్థం తోటి మిత్రులు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ చేశారు. శనివారం మండలంలోని సూరారం జెడ్పీపాఠశాల విద్యార్థులకు శ్రీకాంత్ జ్ఞాపకార్థం అతని మిత్రులు పరీక్ష ప్యాడ్‌లను అందించారు. హెచ్‌ఎం సాయిరెడ్డి, శివప్రసాద్, మిత్రమండలి సభ్యులు ప్రశాంత్, దేవేందర్, సురేశ్, యాదగిరి, శివకుమార్, ప్రశాంత్, నారగాజ్, నవీన్, బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు

టేక్మాల్(మెదక్): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కృష్ణ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ... ఇష్టానుసారంగా మట్టిని, మొరం తరలించరాదని తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. మట్టిని తరలించాలనుకుంటే ఆన్‌లైన్‌లో www.miner.teanfana.gov.inలో సంబంధిత వ్యక్తి పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును మైనింగ్ అధికారులు పరిశీలించిన తర్వాత అనుమతులు జారీ చేస్తామన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మైనింగ్ చేసిన తర్వాతనే మట్టి తవ్వకాలు చేపట్టాలని, లే క పోతే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ గఫూర్‌మియా హెచ్చరించారు.

◆ ఇంటర్ పరీక్షలకు 10మంది గైర్హాజర్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో శనివారం ఇంటర్ విద్యార్థులకు నీతి, మానవ విలువలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 10 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా.. మొత్తం 27మందికి, 10 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు తెలిపారు.

◆ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

రేగోడ్(మెదక్): గ్రామీణ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు.

◆ రాంపూర్ అడవిలో సంచరించేది హైనాగా గుర్తింపు

చేగుంట(తూప్రాన్): రాంపూర్ పరిసర గ్రామాల శివారు అటవీప్రాంతంలో సంచరించేది హైనాగా గురించినట్లు చేగుంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ తెలిపారు. నాలుగు రోజులుగా ఇబ్రహీంపూర్, రుక్మాపూర్, రాంపూర్ అటవీ ప్రాంతాల్లో చిరుత కోసం పాదముద్రలను సేకరించి పరిశీలించగా... అడవిలో తిరుగుతుంది హైనాగా గుర్తించామన్నారు. ఈ జంతువు సమాచారం తెలిస్తే రైతులు, ప్రజలు తమకు సమాచారం అందించాలని తగిన చర్యలు తీసుకుంటామని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.